క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కాన్ సెంటర్‌లు, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. మంగళవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన నరసాపురం సబ్ డివిజనల్ లెవెల్ మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్-1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కాన్ సెంటర్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఈగల్ ఎక్స్‌పర్ట్ చల్లా దానయ్యనాయుడు, వైద్యులు డాక్టర్ జెట్టి గణేష్, డాక్టర్ నళిని పాల్గొన్నారు.

ఆర్యపేటలో వైద్య శిబిరం

యలమంచిలి: ఆర్యపేట గ్రామంలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో మంగళవారం భీమవరం రాజేశ్వరి హెల్త్ కేర్ (నేచురోపతి హాస్పటల్) వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. చర్చి డెలిగేట్ మైలాబత్తుల చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ అల్లూరి శ్రీనివాసరాజు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ శిబిరంలో సుమారు 60 మందికి బీఎంఐ పరీక్షలు ఉచితంగా చేశారు. ఆసుపత్రి సిబ్బంది కుచ్చర్లపాటి సూర్యప్రకాష్, కుమారస్వామి వైద్య సహాయం అందించారు. సర్పంచ్ మేడిది విజయ జ్ఞానమణి, చర్చి పాస్టర్ గోనమండ పురుషోత్తం, గోనమండ జయ శేఖరబాబు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని దిగమర్రు గ్రామంలో వాయుత్రిలింగ క్షేత్రాల్లో ఒకటైన ఉమా సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. గ్రామంలో భక్తజన సమూహంతో స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వల్లీదేవసేన సమేత కుమారస్వామికి పల్లకి సేవ చేశారు. బుధవారం సదశ్యం, భజన కాలక్షేపం గురువారం ఆలయంలో రుద్రాభిషేకాలు, శుక్రవారం త్రిశూలస్నానం, శ్రీపుష్పయాగం జరపనున్నట్లు ఈఓ యాళ్ల సూర్యనారాయణ తెలిపారు.

ఘనంగా కనకదుర్గమ్మ రథోత్సవం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లోఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి వేద పండితులచే వేద పారాయణం, కుంకుమపూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ ఊరేగింపులో భాగంగా ముందుగా అమ్మవారికి కుంభం ఏర్పాటు చేశారు. అనంతరం రథం లాగి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో కావలి శ్రీనివాసరావు, వీరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ-పంట రైతుల జాబితా సిద్ధం

యలమంచిలి: 2024-25 దాళ్వా పంటకు సంబంధించి ఈ పంట నమోదు చేసినటువంటి రైతుల జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి చెప్పారు. కట్టుపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామసభ ఏర్పాటు చేసి, రెతుల జాబితాలోని పేర్లను చదివి వినిపిస్తామన్నారు. జాబితాలో ఏమైనా తప్పొప్పులు ఉంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బందికి రాతపూర్వకంగా ఇస్తే సరి చేస్తామన్నారు. ఈ తప్పులు సరిచేయడానికి గ్రీవెన్స్ మాడ్యూల్ ఇస్తామని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద కూడా జాబితా ప్రదర్శించినట్లు ఆమె చెప్పారు. తప్పులు సరి చేసిన అనంతరం తుది జాబితాను ఈ నెల 22న మళ్లీ రైతుసేవా కేంద్రాల ప్రదర్శిస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో గుంపర్రు నీటి సంఘం అధ్యక్షులు ఆరిమిల్లి రామ శ్రీనివాస్, వీఆర్వో అడబాల వీర వెంకట సత్యనారాయణ (బాబ్జి), గ్రామ వ్యవసాయ సహాయకురాలు మల్లుల కృష్ణచైతన్య పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం సీజ్.. డ్రైవర్‌పై కేసు

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో మొబైల్ డిస్పెన్సరీ వాహనాన్ని మంగళవారం తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్ ఆకస్మిక తనిఖా చేశారు. ఆ సమయంలో సరుకుల్లో వ్యత్యాసం గుర్తించారు. దీంతో సదరు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ నేతల సురేంద్రమూర్తి పై 6-ఏ కేసు నమోదు చేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: మండలంలోని పలు రేషన్ దుకాణాలను, ఎండీయూ వాహనాలను తహసీల్దార్ జి.కనకరాజు, సీఎస్ డీటీ దేవి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ పంపిణీపై లబ్ధిదారులను ఆరా తీశారు. వాహనాల వద్ద ధరలు పట్టికలు, రేషన్ దుకాణాల్లో స్టాకు వివరాలను తనిఖీ చేశారు.

పీడీఎస్ బియ్యం నిల్వపై కేసు నమోదు

పెనుగొండ: సిద్ధాంతంలో అత్యం సత్య శ్రీనివాస్‌కు చెందిన మారుతీ కిరాణాషాపులో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు పెనుగొండ ఆర్ఐ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.గంగాధర్ తెలిపారు. బిల్లులు లేని 50 కేజీల బియ్యం బస్తాలు 30 ఉన్నట్లు గుర్తించామన్నారు.

ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం

- మేలుకోకపోతే పర్యావరణానికే పెను ముప్పు
- ప్రమాదం అని తెలిసినా పట్టించుకోని ప్రజలు



దమ్మయ్యపతి మురుగుకోడులో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ పేరుకుపోయిన దృశ్యం(ఫైల్)



పెనుమదం రోడ్డులో మురుగు డ్రెయిన్‌లో దుస్థితి

పాలకొల్లు సెంట్రల్: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు, అధికారులు హెచ్చరిస్తున్నా ప్రజలు ఆ హెచ్చరికలను ప్రజలు పట్టించుకోవడం లేదు. అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై అనేక అవగాహనా సదస్సులు, సమావేశాలు, పెడుతున్నా, అపరాధ రుసుములు వేస్తున్నా వ్యాపారుల్లో మాత్రం నిర్లక్ష్య ధోరణి పోవడంలేదు. మునిసిపల్ అధికారులు కొద్దిరోజులు కఠినంగా వ్యవహరిస్తుంటే వ్యాపారులు ఓ పదిరోజులు కవర్ల వాడకం తగ్గిస్తున్నారు. తర్వాత మళ్లీ షరామామూలుగా కవర్లను వినియోగిస్తున్నారు. కవర్ లేదంటే వినియోగదారులు మా వద్దకు రావడంలేదని వ్యాపారం కూడా పోతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. మునిసిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటే వ్యాపారులు భయంతోనైనా ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తారని లేదంటే కవర్ల వినియోగం ఇంకా పెరిగిపోతుందే తప్ప తగ్గదని పలువురు పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతిందని వర్షం వస్తే డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల జరిగే పరిస్థితి కనిపించడంలేదని ఇలాగే కొనసాగితే ముందు ముందు మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

40 టన్నులు చెత్తలో సగం ప్లాస్టిక్కే

పాలకొల్లు పట్టణాన్ని 35 వార్డులుగా విభజించారు. ప్రస్తుత జనాభా సుమారు లక్ష పైనే ఉన్నారు. పట్టణంలో రోజుకు దాదాపుగా 45 టన్నులు చెత్త సేకరణ చేస్తున్నారు. పట్టణ జనాభాతో పాటు వివిధ అవసరాలు, ఉపాధి కోసం వస్తూ వెళ్లే జనాభాతో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. ప్లాస్టిక్ సంచులతో పాటు ప్లాస్టిక్ గ్లాసులు వినియోగం ఎక్కువగా ఉంది. ఫంక్షన్‌లలో వాడేసిన గ్లాసులు అలాగే వాడేసిన కవర్లు ఎక్కడికక్కడే రోడ్డుపై పడేయడంతో గాలికి ఎగిరి అవి డ్రెయినేజీలోకి చేరి మురుగునీరు పారుదల లేకుండా అడ్డుపడుతున్నాయి.

ధర తక్కువ.. ప్రమాదం ఎక్కువ

మార్కెట్లో ప్లాస్టిక్ కవర్లు అతి చౌకగా దొరుకుతున్నాయని అనుకుంటున్నారు తప్ప అంతే చౌకగా, అతి త్వరగా ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నామని మాత్రం ఎవ్వరూ గ్రహించలేకపోతున్నారు. మొన్నటి వరకూ కిరాణా, కాయగూరలు, కూరలు, మందులు, స్వీట్లు, పండ్లు వంటివి కవర్లలో పార్శిల్ చేసేవారు. నేడు వేడిగా ఉన్న టీ, కాఫీ, సాంబారులు కూడా కవర్లలో పార్శిల్ చేస్తున్నారు. వేడికి కవర్లు కరిగిపోవడంతో అవే తాగడం వల్ల అనారోగ్యాలకు కూడా గురవుతున్నారు. కాగిత కప్‌ల్లో పది సెకన్లలో తాగే టీ, కాఫీలు ఆరోగ్యానికి హానికరమని చెపుతుంటే గంటల కొద్ది వేడి వేడి చట్నీలు, సాంబార్లు ఉంటే ఇంకెంత ప్రమాదం ఉంటుందో వినియోగదారులు గ్రహించకపోవడం గమనార్హం. ఇవేమి గ్రహించని ప్రజలు తమ అవసరం గడిచిపోతుందే అనుకుంటున్నారు తప్ప పర్యావరణ ప్రమాదాన్ని మాత్రం పట్టించుకోవడంలేదు. ప్లాస్టిక్ కవర్లు రాక ముందు వినియోగదారులు చేతి సంచులు తీసుకుని మార్కెట్‌కు వెళ్లేవారు. సరుకు అవసరం ఉన్నా లేకపోయినా ఏదైనా అవసరం ఉంటుందమేమోనని చేతి సంచి మాత్రం సైకిల్‌కు తగిలించుకునే వినియోగదారులు ఇంటి నుంచి బయలుదేరేవాడు. ప్లాస్టిక్ కవర్లు వాడకం మొదలైన తరువాత చేతి సంచి మాటే మర్చిపోయారు. ఆ ఎందుకివ్వడు వాడే ఇస్తాడులే అనే నిర్లక్ష్య ధోరణి వినియోగదారుల్లోనూ ఎక్కువైంది. మార్పు రావాలంటే అధికారుల్లోనో, వ్యాపారస్తుల్లోనో, వినియోగదారుల్లోనో కాదు మొత్తం అందరిలోనూ మార్పు వస్తేనే ప్లాస్టిక్‌భూతాన్ని అరికట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.



కవర్లలో ప్యాక్ చేసిన సాంబారు, కూరలు

వ్యాపారస్తులకు నోటీసులు ఇచ్చాం



120 మైక్రాన్స్ లోపు ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడరాదని వ్యాపారస్తులకు జనవరిలోనే నోటీసులు ఇచ్చాం. సింగిల్ యూజ్ కవర్లు తయారు చేసిన వారికి మొదటి సారి రూ. 50 వేలు, రెండవ పర్యాయం లక్ష రూపాయలు ఫైన్ వేస్తున్నాము. అలాగే డిస్ట్రిబ్యూటర్లకు మొదటి సారి రూ. 25 వేలు అలాగే అతని వద్ద ఎన్ని కేజీలు దొరికితే అన్ని కేజీలకు రూ. 10, రెండవ పర్యాయం అయితే రూ. 50 వేలు కేజీకి రూ. 20, వీధి వ్యాపారస్తులు అయితే మొదటి సారి రూ. 2 వేలు, రెండవ పర్యాయం రూ. 5 వేలు, ఇన్‌స్టిట్యూట్, కమర్షియల్ ఎస్టాబ్లిస్‌మెంట్ వారికి రూ. 20 వేలు రెండవ పర్యాయం రూ. 40 వేలు ఫైన్ వేస్తున్నాం. బయోడీగ్రేడబుల్ కవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. అవి నెల రోజుల్లో భూమిలో కలిసిపోతుంది. ఈ కవర్లు వాడుకోవాలని వ్యాపారస్తులకు సూచిస్తున్నాం.

– రాజు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, పాలకొల్లు

21న మాధవాయిపాలెం రేవు వేలం

నరసాపురం రూరల్: ఉభయ గోదావరి జిల్లాల్లో కీలకంగా ఉన్న నరసాపురం – మాధవాయిపాలెం రేవు వేలాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టోల్స్ వసూలు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాట ప్రారంభపు ధర రూ.3.13 కోట్లుగా నిర్ణయించామని స్పష్టం చేశారు. సీల్డ్ కమ్ బహిరంగ వేలం పద్ధతిలో వేలం ఉంటుందని వివరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫెర్రీ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుని స్పష్టం చేశారు.

రెస్టారెంట్‌పై రెవెన్యూ అధికారుల దాడి



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న రెవెన్యూ అధికారులు

నరసాపురం: పట్టణంలోని ఓ రెస్టారెంట్‌పై మంగళవారం రెవెన్యూ అధికారులు దాడి చేశారు. గృహ అవసరాలకు వినియోగించే నాలుగు వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నరసాపురం తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, సివిల్‌సప్లై డీటీ ఐ.సత్యనారాయణ, వీఆర్వోలు దాడిలో పాల్గొన్నారు. రెస్టారెంట్ యజమానిపై కేసు నమోదు చేశామని తహసీల్దార్ తెలిపారు. గృహ అవసరాలకు ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘యువత పోరు’ను విజయవంతం చేయాలి

పోడూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విద్యార్థులు, యువత విజయవంతం చేయాలని ఆ పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) పిలుపునిచ్చారు. యువత పోరు పోస్టర్లను మంగళవారం కొమ్ముచిక్కాల గ్రామంలో గోపి ఆధ్వర్యంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెనుమదం సొసైటీ మాజీ అధ్యక్షుడు కొరప్రాటి వీరాస్వామి, జిల్లా యూత్ సెక్రెటరీ దేవ రాజేష్, జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ వడ్లపాటి సురేష్, మండల యూత్ అధ్యక్షుడు దిగమర్తి నాగరాజు, లీగల్ సెల్ నాయకులు వడ్లపాటి ఆనందరాజు పాల్గొన్నారు.

మేడపాడులో..

యలమంచిలి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను మంగళవారం మేపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరిట రాష్ట్ర ప్రజలను మోసం చేసి కూటమి నాయకులు గద్దె నెక్కారని విమర్శించారు. కార్యక్రమంలో వినుకొండ రవి, ఓడూరి భాస్కరరావు, ఉచ్చుల స్టాలిన్, గుర్రాల వెంకట్రావు, గంధం సత్యకీర్తి, మామిడిశెట్టి చిట్టిబాబు, పొన్నమండ నాగరాజు, గుడాల సురేష్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: విద్యార్థులను, నిరుద్యోగులకు కూటమి ఇచ్చిన హామీని నిలుపుకోకుండా మోసం చేసిందని పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) అన్నారు. మంగళవారం పెనుగొండలో ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం భీమవరంలో చేపట్టబోయే ధర్నాకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నల్లిమిల్లి బాబిరెడ్డి, పులిదిండి వెంకటేశ్వరరావు, పోడూరి రామయ్య, కేశవరపు గణపతి, చిటికెన బాబి, కుడిపూడి సుబ్రహ్మణ్యం, సుంకర నాగబాబు పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరంలో..

నరసాపురం రూరల్: యువత, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు నమ్మించి మోసం చేశారని వైఎస్సార్ సీపీ నరసాపురం మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్‌నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో మాజీ ఆప్కాబ్ చైర్మన్ అంగ్రాజు చల్లారావు నివాసం వద్ద జరిగిన సమావేశంలో ఆయన యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అంతా కలసి పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నాయకత్వంలో బుధవారం ధర్నాకు బయలుదేరి వెళ్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్, ఎంపీటీసీ సభ్యుడు కోలపర్తి రామకృష్ణ, మత్తే సువర్ణరాజు, బిల్లు సత్యనారాయణ, బిల్లు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ అధినాయకత్వం పిలుపు మేరకు బుధవారం నిర్వహించనున్న ఫీజు పోరు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పిలుపు నిచ్చారు. మంగళవారం సీతారామపురంలో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారి చదువులు కుంటుపడుతున్నాయన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో యువతను, నిరుద్యోగులను మోసం చేస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్న కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిని ఎండగట్టడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మంగళవారం పాలకొల్లు పట్టణం, మండలాల్లో యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. బుధవారం పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సిపి 15వ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించిన అనంతరం యువత పోరు కార్యక్రమానికి తరలి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్రా జయసరిత, సనిశెట్టి లీలాభవన్నారాయణ, చాన్‌బాషా, పెద్దిరాజు, పెన్మెత్స ఏసురాజు, జోగాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: విద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి అన్నారు. యువత పోరు, వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి యువత పోరు పోస్టర్ ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, పెన్మెత్స విశ్వనాథరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి కిరణ్, కొవ్వూరు వేణుమాధవ్ రెడ్డి, చింతపల్లి గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోడూరు: యువత పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



యలమంచిలి: మేడపాడులో యువత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెనుగొండ: ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



పాలకొల్లు సెంట్రల్: యువత పోరు వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మండల నాయకులు



పాలకొల్లు సెంట్రల్: యువత పోరు వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పట్టణ నాయకులు



పెనుమంట్ర: యువత పోరు వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఎస్‌వీకేపీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పెనుగొండ: ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో వర్‌ట్యస్ సాఫ్ట్‌వేర్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. 68 మంది హాజరు కాగా, ఆదిమూలం కృష్ణమాధవి, ఎ.దేవి శిరీషా, కొవ్వూరి లక్ష్మీ అపర్ణ, డి.పృథీ్వరాజ్‌లు ఎంపికయ్యారన్నారు. కంపెనీ యజమాని అరవింద్‌కు, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

యలమంచిలి: మండలంలోని పెనుమర్రు, నేరేడుమిల్లి గ్రామాల్లో మంగళవారం పశుసంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది 102 ఆవులు, 284 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేశారు. బాడవ, ఏనుగువానిలంక గ్రామాలలో బుధవారం ఈ శిబిరం నిర్వహిస్తామని చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

పెనుగొండలో..

పెనుగొండ: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు ఉచిత టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ ఎం ప్రమీలారాణి తెలిపారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో పశువులకు ఉచిత టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పశువులకు గాలికుంటు వ్యాధి, నాలుగు నుంచి 8 నెలల వయస్సు పెయ్య దూడలకు బ్రూసెల్లా వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నామన్నారు. ఈ నెల 30 వరకు వ్యాధి నివారణ టీకాలు అందిస్తామని తెలిపారు.

హ్యాకథాన్ పోటీల్లో స్వర్ణాంధ్ర విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్య సభ్యులు

నరసాపురం రూరల్: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వివిధ పోటీల్లో ప్రతిభ చూపించారు. వీరిని మంగళవారం కళాశాల యాజమాన్యం సత్కరించింది. తృతీయ సంవత్సరం సీఎస్సీ బ్రాంచ్ విద్యార్థులు వివేక్, భర్గవి, సాయి ఇతర సభ్యుల బృందం హ్యాకథాన్ పోటీలలో ట్రాన్సిట్ టెక్నిక్స్‌లో ప్రథమ బహుమతిని సాధించారు. ఇటీవల బెంగుళూరులో ఐఈటీ-2025 సంస్థ నిర్వహించిన పోటీలలో విజేతలకు ట్రోఫీ, ధ్రువపత్రాలు, ఇంటర్న్ షిప్‌లను అందుకున్నారు. వీటితో పాటు స్వర్ణాంధ్ర కళాశాలకు చెందిన ఐఈటీ ఆన్ క్యాంపస్ అత్యుత్తమ పురస్కారం సీఎస్సీ విద్యార్థి పి.వివేక్ కు నెక్ట్‌జన్-2025 అవార్డు, జీబీ క్రిస్టినాకు ఐఈటీ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు లభించాయి.

మెకానిక్ విభాగంలో...

మెకానికల్ బ్రాంచికి చెందిన టీమ్ కెప్టెన్ వై.రాంబాబు, వైస్ కెప్టెన్ పి చరణ్‌లు ఇటీవల టెక్కలిలోని ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గోకార్ట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బెస్ట్ ఇన్నో వేషన్ అవార్డుతో పాటు రూ.10 వేల నగదును అందుకున్నారు. ఈ టీమ్‌కు ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్‌గా మెకానికల్ డిపార్ట్ మెంట్‌కు చెందిన డాక్టర్ ఆర్.లలిత్ నారాయణ, సీహెచ్ హరీష్ కుమార్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్ అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పాలకొల్లు సెంట్రల్: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టే శిశువులు ఆరోగ్యవంతంగా పుడతారని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, వాకర్స్ సభ్యులు పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు పాల్గొన్నారు.